# మా ఊరి ముచ్చట

ఏసడీ చప్పుడూ లేకుండా కడుపునిండామేసి కన్నరమోడ్చి నెమరేస్తున్న గొడ్డులా వున్న ఆపల్లెటూళ్ళో ఓ సంచలనం బయలుదేరింది.

అయ్యా ! శంకరయ్యొచ్చి శివుని గుళ్ల సెట్టకింద జేరిండంటయ్య.

వారీ ! తిక్కసన్నాసీ ! ఆపరమశివుడు ప్రమధగణాలతో కూడి ఆలయంలో వేంచేయక తడికచాటుకు చేరుతాడ్రా ?

అప్రాచ్యుడ ! లేచింది మొదలు పని ఎగవేసే తంతులు. ఫో ! అవతలికి.

పంతులయ్యో ! ఓ కర్ణంప్పంతులూ ! వొచ్చిపడ్డదయ్యో ! దాడి ! ఈత్యాప మోదిందార్లంత ఆడీ మొగ అప్సర్లను ఎంటబెట్టుకోని పట్నన్‌కు పట్నన్ మిడ్తలదండోలె వస్తుండరంట . కాస్రాపారాల కరామత్ ఏంజేస్తరో గని జెరబద్దురం.

పటేలయ్యా ! కాకె రొడ్ల గుమ్మిమెత్తులు ఊడదీయాలె ! పాపం !మొన్ననే పాతం జేపిచ్చి పోస్తివి గదయ్య ! ఊళ్ళ కోడి పిల్లలకు కర్వులేదుగని, గా వాసన బియ్యమే ! మనతాన దప్ప యాడవుట్టవు. వచ్చేటోళ్ళేమొ ఆపూటకు పాలావ్‌దినెటోళ్ళు నంట. కాదని మా మొకం చిన్న జేయకు మరి.

ఓసీ ! జంబులీ ! ఇదేం సిత్రమే ! మాటన్న సెవుల ఏయకపోతివి ! మనూరికి మీరు సాలరన్నట్లు ఇంకో దొమ్మరితండ వొస్తుండదంటగదా? ఆ తండల్నేమొ సగానికి సగం సక్కటి సువ్వలోలె ఆడివిల్లలేనంట. ఎంతదొమ్మరిసాన్లైతే మట్కు 'ఆడీ మొగకు ఒక్క బట్ట అంట' పురాగ మొగ పోషకుల్నే దిర్గుతారే ? యాదో ! మొగ్గ వాలేటప్పుడో, గడలేసే టప్పుడో అంటె గుత్తెంగ కాసె వోసి పిక్కలుగానొచ్చే టట్ల బిగిస్తరుగని మరెంటె మరి పట్లోన్లా, నైకర్లు దొడ్గితిర్గుతారె ?

సీతా ! నీకు పుణ్యం ఉంటది గని ఈనాడు మట్కు పొలిమేరదాటి పోకు తల్లి. ఆ స్వామికి పూల అలంకారం లేకుంటె తులసి దళాలు చాలు, కలికాలపు భ్రష్టాచారం

మనూరికి సాక్షాత్తుగా నడ్చుకుంటు వస్తుందంట. ముదనష్టపు సదువులు.

బూలచ్మీ! ఇన్నావమ్మ ? ఈ చిత్తురం! మా నడిపి పోరడు మోర్దోపుగాడు వాళ్ళ నాయిన బర్గె ఇర్గదంతె అల్గి ఊరబాయి మొకాన వోయి, కడ్పుల మసిలిందేమొ ఊడ్గపండ్లు రాల్సుకుంటున్నడంట, ఇంతట్లకె పట్నం కెళ్లొచ్చిన వో ఆడివిల్ల మా పిలగాణికి వో రూపాయి ఇచ్చి శారెడన్ని ఊడ్గపండ్లు దీసుకున్నదంట. మావోడు ఏన్గెను ఎక్కినంత కుసి వడ్తుండు.

ఓ సావుకారి ఇయ్యాళ్ళ నక్కన్ దొక్కిన వయ్య. నీపూలు పుట్కల వడే కాలమొచ్చింది, పట్నం కెళ్ళి లక్షిందేవి నడ్సుకుంట నీ ఇంటికాడ్కి వొస్తుండది, ఇగ జూస్కో తడాక! శాయెపత్తకు, శక్కరకు వీవు వర్కిందే దర! చాయెసుక్క గొంతుల వడ్తేగని పక్కలు దుల్పని నాగరీకం నడ్మసన్నాలు వస్తుండరంట గదయ్యా?

అవురా! అవ్! అంత, నా గల్లపెట్టెనే నిండుతుండది. మీ పంచులు, పాపం ఏలువెడ్తె కొరకరు, ఎన్నపెడ్తె మింగరు. ఈకాల్వకు ఎన్నితూట్లో ?

అమ్మా జానకమ్మ! మనూరి తోపుల్లల్ల సోర సోర దుడ్డెగాళ్ళా, దోరగాయల సొంటి ఆడివిల్ల లంతగల్సి సిల్కా గోరెంకల్లోలె వాల్తుండరంట. సీనిమ్మ ఎలిసి నట్లుండది. అంట మీ పాలేరోడు జెప్పంగ ఇన్నతల్లి.

ఏందిరా చిలుకయ్యా! మనూరంత ఉట్టి ఊగినట్ల ఊగుతుండది. 'ఊరిమీద ఊరు పడేనంట మంది అంత ఒక్కటే పర్గులూ, ఉర్కులు. నిల్కడన్న మాటలేకుండ మెసుల్తుండరు. 'కదిలిస్తే కతలురాలె' అన్నట్ల ఎవర్ని వలుకరిచ్చినా ఇచిత్రాలె దండలు గుచ్చుతుండరు. యానోటజూసినా అదేమాట.' మనూరికి సూడసక్కని బొమ్మలూ సూస్తె కడ్పునిండే కోడెకార్లు వొస్తుండరంట. ఇంగా ఇనే తల్లి! మనబోయమాసాని లేదు. అది ఎదనావోలె ఉరుక్కుంటొచ్చి నెత్తి దిగపార స్తానం జేసి ఎల్లమ్మ గుడిని పస్పు కుంకుమల్తోటి పూజిచ్చి 'యాపసీరగడ్త' అనుకుంట ఇప్పుడే శిగం నిండుతుండది.

ఇగ సవారిసాయన్న పెండ్లాంబోయిన మనిషోలె రెండుజేతులు నెత్తికి వెట్టుకోని అయ్యో! పీరీల పండుగన్న గాకపాయె 'బీంఫాత్మమ్మను' ఎత్తుకోని సవారినిండి అలాయి దుంకి నబ్బిగాణి సడ్మ ఇర్గదంతుంటి' అని మిడ్కుతుంటె, కావలి శెన్నప్పొచ్చి నీ సత్తాని కేం తక్కువ కాడిపీరికి దట్టిగట్టి ఎత్తుకో! మొల్లగాడు గుడ్లు త్యాలేయాలె' అన్నడంట.

కుశాలుగ వాడిప్పుడు నా దగ్గరికొచ్చి జుంకాలు, చెత్రి, ఇప్పిచ్చుండి సవారి దుల్పుకోని ఆవస్తువలు బద్దురంగ వొప్పజెప్త నంటుండ డని బీమక్క జెప్తుండది.

అమ్మో ! అందరు అన్ని ఇక్మతులు జేసి రొండు పైసలు కండ్ల జూస్తుంటే నేను యాది శాత గానట్ల కూరుక్కుంట గూసుంటనా? ఏంది? నేను గద్దె జెప్త ! అనుకుంట ఎర్కల నాంచారి గద్దె బుట్టి, గవ్వల గుర్గి, కోల సవరిచ్చుకుంటుండ దంట. ఇంగా ఇను యాదోకల్లాలప్పుడో, పండుగలకో, పబ్బాలకో, కండ్లవడె పిచ్చకుంట్లోండ్లు, శార్దకాండ్లు, గంటె బాగవతులు, నూనెబాగవతపోండ్లు, బైండ్లోండ్లు ఆరబైండ్లు, కొమ్ముదాసర్లు, వీళ్లంత వొచ్చి మన వాయిలుపంపుల్ల గుడారాలేసుకున్నరంట. అంతెందుకు ? నిన్న ముసి ముసి సీకట్లల్ల నేను పెద్దబంకుల్ల గూట్ల దీపం ఎలిగిస్తుంటే నిరుడు మా బావ గప్పిన ఎర్ర శప్లజుట్టుకోని గంగెద్దుల నర్సింగప్ప రానే వొచ్చె. దొరుసాని రేపు మన కర్రె కండ్ల సీతక్క అల్క జూసి తీరాలె మన ఇంటి ముందరైనంకనే జనం అంత జూస్కం అనుకుంట ఇట్ల వోయిండో లేదో మన ముక్కిడి వొస్తాదు వొచ్చి అమ్మా ఓ గిలాసడు మజ్జిగె వోపిచ్చుండి సుక్క ఊడిపడ్డట్లు మన దస్తగిరి గూడంగ దిగిండు.

ఈ యాళ్ల కల్లుగిన ముట్టడంట తనుసింగారిచ్చె చెందురారం, బేడీ, దండె గడెం, శికెబిల్లలన్ని కంచు తలెల సింత పండేసి సిల్కు ఎల్ల దోముకుంటుండడు పెద్ద సదువులోళ్ళకు తన ఖదరు దెల్సినట్ల మన పల్లెగొంపలోళ్ళకు దెల్వ దంట. వాళ్లతోటి తాను గూడ పోట్‌గిరాప్‌ల వడి పత్రికల కెక్కుతనని ఒకటే ఉబ్బుతుండడు.

అమ్మ ! లక్ష్మి ! నీకు అసలు సంగతి జెప్పనే లేదు. నిన్న కుమ్మరి కిష్టమ్మ సన్న విల్లకు ఎన్నపూస కనివొస్తే నేను పిల్లా ! జెర పిండిఇసుర రాతిమీద వోసి యిసిరియ్య మంటె అది పటేలమ్మో ! ఈ త్యాపకు మట్కు మీ మాట మిగమీరిందని ఏమను కోకు. లేక లేక లోకయ్య వుట్టెనంట మీ కుమ్మరి ఈయాళ్లనె సారె చక్రం బెట్టి కూసున్నడు,. చేసిన కుండలన్ని ఆరవెట్టి పిల్లి.కుక్క బోర్లిచ్చుకుండ ఆవం గాలేవరకు కావలిగాయాలె అనుకుంట జారుకున్నది.

ఇంగ నేను మన పెద్దోణి మెల్లకు జత గుండ్లల్లకు కాకెరకాయలు జేతువుగని రావయ్య ఎంకట్రాముడా ! అంట పోరగాణ్ణి దోల్తే అవుసుల ఎంకట్రామయ్య దుకాణానికి దుకాణమే బీడు వెట్టి బొడ్రాతి ఎల్లని ఇంటికి వోయి ఓ బీడీల కట్ట వారేసి ఎల్లయ్యా ! మనం గుడ్డెలు ఏశం ఏతాం పద. నీవు నా ఎంట గొంగడి

కొప్పెర వెట్టి తిర్గు' అంట దువ్వుతుండ డంట.

ఇవన్ని ఇట్ల నడుస్తుండంగనె మన బొప్పల బాలయ్య బొమ్మ లాడిచ్చుకుంట దివాల్దీసి 'తా జెడ్డకోతి వనమెల్ల చెడ్సె' అంట పాపం పెండ్లాం బుగులకు పక్క ఊళ్ళు కోతలపని గుత్తదీసుకున్న పక్కీరయ్య కాడ్కివోయి 'అన్నా! పక్కీరా! నీ సేతుల హౌన రుండది. కోతులూ ఉండవి, దీపం ఉన్నప్పుడే ఇల్లు సక్కవెట్టుకోవాలె, నీ తిమ్మయ్య లను దోల్కరా భాయి రొండు పైసలు కండ్ల జూస్తవ్' అన్నడంట.

జూదగాణి ముంగల గవ్వల సప్పుడైనట్ల వాడేమొ ఉటా ఉటి కొంపకు వోయి వాణి సిన్న పోరి అంగి ఇడ్సి చిన్నతిమ్మనికి గప్పి, నడ్పి పోరిపూసల లోలాకులు ఊడవీకి తల్లి కోతికి దగిలిచ్చి తాను నెత్తిన సోల టోపి వెట్టుకోని వొచ్చి బొప్పలోండ్లింట్ల దిగిండంట.

అన్నిటి కన్న అబ్బురమైన ముచ్చట ఇన్నవా? మన బిచ్చగిత్తి జోలెకు వట్టిన సీరపొత్తులన్ని దుల్పి సిట్టెడు ఉసిళ్లు తన సందెడు పోరగాండ్ల దోసిళ్ల వోసి మీరు జింగన్న రెక్కల్తాన ఈ జోలె నింపాలె. మాపట్యాళ్ళ కల్లుదుకాండ్ల అన్నగుగ్గిళ్ళు బుక్కవెడ్త లే అంట దోల్కోని సేండ్ల పోంటి వోయిందంట.

'అన్నీ ఒగెత్తు రంగరాయనిది మరో ఎత్తు అంట మా తమ్మయ్య యాడ దొర్క వట్టిండో మరి ఇద్దరు సెంచోళ్ళను విల్సుకొచ్చి, ఆరె, భీకా! అసే 'జగ్గి' మీ మాట పాటి దప్పుగూడదు. ఎల్లుండి పొద్దు వొడ్సెట్యాళ్లకు సెంచు గడ్డలు మంచిగ 'ఉస్కకుమ్ముల' ఉడ్కిచ్చి, తేనెతెట్టెలు వొండి సొరకాయ బుర్రలల్ల నింపుకోని రావల్నంట జెప్పి 'కంటికి కరువైపోయిన సెంచుగడ్డలను ఆపురూపంగ దెప్పిస్తుండడంట.

సూడు సూడు మంట ఎల్లుండి గంప జాతరుండది, వొన బోజీనాలుండవి, ఈసారి తొప్పెట్ల కొల్లు కుర్వ భీమన్న డోలు రొండు, పైపోటీలు వెట్టుకోని అమ్మకు వొందునం జేస్తరంట.

తల్లీ చిల్కరాజా! మనూళ్ళ ఇంతలొల్లి పుట్టింది ఇదంత ఏందీ ? ఏంకత ? అంట మీ అన్న నడ్గితె వాణి సెవుమీద పేను వారినట్లలేదు. మీ నాయిన 'లింగం మింగిన జంగమయ్య' తీర్గ హరిలేదు శివలేదు. మరి నీవే మంటవో ? అన్నది.

# మా ఊరి ముచ్చట్లు(రెండోనాటికత)

ఈ మాటలన్నీ పారవశ్యంతో వింటున్నది లక్ష్మి. ఇంతవరకు చెప్పుకు పోతున్న తనమేనత్త మాటలతో మైమరిచిన లక్ష్మి తేరుకుని అబ్బ అత్తయ్యా ! ఇందాకా నీవు మాట్లాడుతూ ఉంటె జానపద జీవితంపై మాంచి ఉపన్యాసం వింటున్నట్లుగా ఉంది. ఇక్కడే పుట్టి ఈ పరిసరాల్లో వున్న నాకే యీ ముచ్చట్లన్నీ కతలుగా వుంటున్నాయి అంటే ! ఇక నా ఫ్రెండ్స్ వింటే ? నిన్ను వదుల్తారా ? పలుక నేర్చిన జానపద విజ్ఞానం అనరూ ?

అరే లచ్చన్నా ! నాముందుల ఏలెడంత పిల్లవు ! నీవు వొగిడ్డనేనేం పొంగి పొర్లను గని, ఊగిఊగి ఉన్న కాడికె వొచ్చె వుయ్యాల అంట పట్నవాసం రుచిగొల్పక నా ? తల్లి ! మీవోండ్లు మా పల్లెపట్టుల కొస్తుండరు?

అదేం కాదత్తయ్యా ! వాళ్లంత పెద్ద చదువులు చదువుకుని జానపద సాహిత్యంలో పరిశోధన్లు చేస్తున్నారు, జానపదుల కళలూ వేడుకలూ పండుగలూ, ఆటపాటలూ, పెళ్లి పేరంటాలూ, అన్నీ తమ కళ్లతో చూసి తెలుసుకుందామని వస్తున్నారు.

అమ్మ లక్ష్మి ! సూడుతల్లి నీ దోస్తులు వస్తే వొచ్చింద్రుగని 'గుర్రం భోతపోత గూటం బీక్కపాయె' నంట మనూళ్ల మిన్కు మిన్కుమనకుంట గుడ్డిదీప మెలె గానొస్తున్న ఈ యింత ఎలుగును గూడ నిలువుదోపిడి జేసి పోకుంటెసాలు !

లచ్చన్నా ఈ కతింటే నీకె తెలుస్తది. మాతమ్ముణి ఇల్లు నీవు జాసిన వో లేదోగని మా తల్లిగారి ఊరుమట్కు పొంకంగ కిన్నెర కాయెోలె ముద్దుగుండేది, ఉత్తరాన కోట గట్టు పడమటరెడ్డి గట్టు, దక్షినాన పెచ్చెరువు, తూర్పున మట్కు పట్నం. పల్లెను గల్సి కుంట వో రైలు కట్ట. ఆ కట్ట కిందికెళ్లే మా తమ్ముణి పొలాలకు నీళ్ల వారె కాల్వఉంటది, దానిపొంటి దీపపు స్థంబాలోలె నిలువెత్తు శాగరమట్ట పొదలు, పెద్దకలమంద సెట్లు ఉండేవి. ఎడ్మదిక్కు మోదుగువనం, ఆ వనాన్ని అను కోని గుట్టరాళ్లు. ఆరాళ్లకు తునికి,

ఊడ్గ,ఉల్లింత మొర్లి చెట్లు కావలసినన్ని ఉండేవి, ఎవరి ఇండ్ల ల్ల పెండ్లికైనా అప్పుడం వడెం పెట్టవలసివచ్చినా, అద్దాలోలె శుభ్రంగ మెరిసే ఈ బండ రాళ్లకె వెడ్తుండిరి. అవి ఎండినంత సేపు బీడువడి కూసోకుండ పక్క పోంటే ఉన్న మోదుగాకులు దెంపి కావల్సినన్ని దొప్పలు, ఇస్తళ్ళు గుట్టు కోని మిగిల్న ఆకులు ఈనెలు దీసిన సొప్పబెండ్లెస్తె వాళ్లేమొ గాజులు, బండ్లు సైకళ్లు చేసుకుంట ఆడుకుంటుండిరి. జెర ఎడపిల్లలు,కాలువల నీళ్లల్ల కొచిప్పలు ఏర్కొచ్చి బండకు రాసి బొర్ర జేస్తే వాటితొటి మాడికాయల పొట్టు దీసి సిన్న తొక్కుకు తయారు వెట్టు కుంటుండిరి. ఇంటినుండి సద్దులొచ్చెటందుకు అల్శ్యం అయితె ఆణ్ణె ఉన్నసేండ్లల్ల కెళ్లి నాల్గుకంకులు దెప్పిచ్చుకోని కాపిళ్లు గాల్చిచ్చి బండ సొర్కొలల్ల గూసోని తిని వొకూర్కు దీస్తుండిరి. పచ్చీసాడు తుండిరి.

ఇగమా ఇంటికి ఎడ్మదిక్కు అంటె పొలిమేర దాటంగనే బాటసారికి కుడిమొకాన ఆంజనేల గుడి, అవతల దిక్కుపూల తోట ఎన్క దాసరి కన్కప్ప సౌడు కప్పు ఇల్లు ఉండేవి. కన్కప్పబ్రహ్మంగారి శిష్యుడైన కాణ్ణుండి. పొద్దున్నె లేసి తత్తవాలు 'వాద్కం అలువాటు జేస్కున్నడు. వొష్టిమయ్య దేవుణికి ఆరగింపు జెసి జేగంట వాయించె ట్యాళ్లకు ఏక్తారు మీద అక్కడ టింగ్ 'మనిపిచ్చి 'గోవిందా ' అంటుండె. అది ఇంటున్న వొష్టిమయ్య కట కట వడుకుంట మా తమ్మయ్యను జూసి ఔ'ఈ దాసరయ్యకు వేదాంతం శనా ముదురుతుండది. పురాగ ముదురకుండ జెర కత్తిరిచ్చాలె పటేలా ! అంటుండె. ఆ గుళ్ల జరిగే నిత్తె దీపారాదన మా వొంతు, ఎవ్వరు కార్తీకాలు గట్టిచ్చినా బజనపర్లకు మా ఇంట్లనే బోజినం.

ఓనాడు మా తమ్ముడు వాణి మొదటి బిడ్డతోల్సూరు దాని తొట్లెకు రమ్మంట బండి దోలిండు. పుట్టింటి పుంటి కూర రుచిదెల్వందెవరికి ? పోయిన. పోయిన గోలె ఒకటేపని, బాలెంతకు సందు నీళ్లు పోయాలె, గోడకున్న మడి ఎల్లమ్మను పూజిచ్చాలె, బాలమ్మకు నూనెదార, పాలదార వోయాలె. మాయిగుంట్ల కాడ కోడిగోయాలె. ఎవ్వరు గానకుండ బాలగ్రహాలకు కల్లు సాకవోయాలె. గుగ్గిళ్లు పొత్తిళ్లల్లవోయాలె. నవధాన్యాలూ పత్తిగింజలు గలుపాలె, ఎల్లిపాయలదండగుచ్చాలె, నీళ్లకెళ్లాలె, ఎన్నలు బొక్కొన్ల ఏసి సంతులేని తల్లికి వెట్టాలె. లింగాల పూజిచ్చాలె. పెద్దతలుపు ఇడ్పులకు చెందురం చేతులు, గొట్టాలె ఇంటిదేవుడు ఎంకటేశ్వర్లకు మడి తోటి బక్షాల వొంటజేయాలె. రాత్రికి దావతు !

ఇది సాలదన్నట్లు వరా పెద్దత్తోళ్ల కొత్త బాంయికి పుణ్యావాచనం ' మావిళ్ల పెండ్లి జేస్తుండరు. ఇంటి ఆడిపిల్లను తలుంబ్రాల తాంబాళం మోసెదినేనే. గున్న మామిడికి సీరగట్టివాడి బియ్యం బోసేదినేనే. మంగళారతిచ్చి కట్నం దీసుకునేది నేనే! తప్పు తాదిమరి ?

అందుకే కోళ్ల గుయ్యంగ లేసి వొంటింటి జాలట్లనే స్తానం జేసి అన్రబీలసీర, జింగన్న రెక్కల రైకదొడ్డి పట్టెడ, నాను గుండ్లటిక్కి, జోమాలదండల్యూ, వొడ్డెంకు పెట్టుకోని పోతుంటె మామర్దలు అడ్డమొచ్చి

'అయ్యో ! ముక్కుపోగు లేకుండ హంసనత్తుతోటె వొడివాలెట్ల వోస్తవమ్మా! చెంప సరాలు కూడదీసినావ్ ? బిల్లలొడ్డాణం ఏదీ ? నల్లుగట్ల మాయన్నకు సిన్నతనం దేకు! పెట్టు కోవమ్మ! అన్నది.

తీరకగని సామ్మంటె ఇష్టం లేకనా ? నోట్ల మాటనోట్ల ఉండంగనె అన్ని అలంకారాలు జేసుకున్న. పోయి లాంచినాలు జర్పి వొచ్చెట్యాళ్ళకు నా మ్యానగోడలు పట్నంల సదివేది వోపదిమంది దోస్తులను ఎంటేస్కొచ్చింది.

అదిరాంగనే పండుగమ్మ ఇంట్లకు నడ్సుకుంటొచ్చినట్లని పిచ్చింది. దాన్ని జూస్తున్న కొద్దికి చంద్రదీపం ఎల్గినట్లనిపియ్య వట్టింది. సిద్మి దీపం బెట్టుకున్నా కొదువే అంటుండది నా మనస్సు ఈడైన కొడ్కుంటే ? ఈ బొమ్మ వాణి పెండ్లం అయితుండె గద? అంట మసి మసి పడి మళ్ల పిల్లా ! నీవు తొల్తస్తానం జేసిరా ! అటెంక కాళ్ళకు దండం బెడ్తువుగని, మీ దోస్తులకు చాయె, పలారం నేనువంపె సర్పరాయి చేస్తగని నీవు దబ్బున వో అన్న. అది జాలట్ల కెళ్ళి వొచ్చెట్యాళ్ళకు నా సామ్మూ, సామందం అంత దీసి దాన్కివెట్టిన. అది సిగ్గు పడుకుంటనే కిలకిల మంటుండది, ఎవ్వరి సందట్ల వాళ్లుండరు. ఇంట్ల సంబురాలు జర్గుతనే ఉండవి.

# మాపూరి ముచ్చెట్లు (మూడోనాటికత)

తెల్లారిదీపాలు ఎల్గిచ్చినంక గుడికాడ దివిటీలు ఎల్గినయ్. తొప్పెట్లు, కుర్వడోలు ఒగటిమించి ఒగటి డమడమ అన వట్టినవి. ఏంది ? అంటె మాకుర్వ నర్సప్ప బిడ్డ పెండ్లి అది గొంగడి బొంతలోళ్ల మోటు పెండ్లి అంట ఎవ్వరువోరు. అది దెల్శే అయ్యగారు గూడ సరిగ్గవోడు. అందుకే వాళ్ళ 'భీరప్ప' నే గుడిముంగల తంతు జర్పుతడు, అందుకే ఎవ్వరు పట్టిచ్చుకోరు. గని మీ పట్నపోండ్లు ఈ మాటయిని పోదం అంటె పోదం సూతం అంటె సూతం అన్నరు. అందట్ల గల్సి సత్తెబామతీర్గ సింగారొల్కుతున్న నా మ్యానగోడలు గీడ్నెగద పాయ్యోస్త అంటేనేనూ దానెంట గల్సిపోయిన. ఆడ్కివోయె ట్యాళ్లకు యాప సెట్టు కింది అరుగమీద పిల్లా పిలగాణికి అయినోళ్ళంత సుట్టురా నిలవడ్డరు. ఆడివిల్లలంత కుర్వోండ్ల మళ్ళ సీరలు,గెంటీలు, జంపులు, రూపుల దండలు, బంతిపూల శికముడ్పులు, కాసెకట్లు అన్ని సీనిమ్మల బొమ్మలను జూసినట్ల-చూస్కానికి ఎగ నడ్డరు, పెండ్లి, పుస్తెగట్టుడు అయినట్లుండది ఇంగ పోలు సుట్టు పిల్లనూ పిలగాణ్ణి వాళ్ళ మ్యానమామలు సంకనేస్కోని తక్కోడ గుండాడ్తుండరు, వాళ్ళ ఊపుల ఈ పెండ్లి పిల్లా పిలగాడు ఉడ్తపిల్ల లోలె ఇర్కింట్రడు.చెయ్యెత్తు మణుసులు బాగ దండలు దిర్గి లొట్టెడు కల్లు దాగి కండ్లెర్రగ గాంగ దుంకుడు దుంకు డంట డోలు డిల్లెం కల్లెం అన్నట్లల్ల ఎగిరెగిరి దుంకుతుండరు. వీళ్ళెంట కొత్తగ పెండ్లయినోళ్లంత వాండ్ల వాండ్ల పెండ్లాలను గుంజుకోని సంకలేస్కోని తక్కోడ గుండాడ్తుండరు. అంత ' రంకురాట్నం ' దిర్గినట్లయితుండది. పట్నపు పిల్లలు కడ్పులుబ్బ నగు కుంట పొటోలు దింపవట్టిర్రు.

ఇది ముగిచ్చుకున్నంక, ఆకు పోకల సంబురం నడ్వవట్టింది. లవంగం అందుకునే టప్పుడు సిన్నగుండి నోటికి దొర్కకుంటె పిల్లా పిలగాణి ఎంబడి గూసున్న వరుసైన ఆలు మొగుండ్లు తానే అందుకుంట మళ్లోసారి పెండ్లియినట్లు సిగ్గులొలుకంగ పుల్కరిస్తుండరు ఇంతట్లకే మల్లన్న దేవుడు పైమీదికొస్తే ఉగ్గురం ఆగ వట్టలేక పక్క-పొంటి ఉన్న మా మ్యానగోడలు పార్వతిని జవిరి సంకలేస్కోని తక తక మంట తక్కోడు

గుండాడ వట్టిండు భీరప్ప. ఈ శిగాన్ని జూసి ఆ దిక్కున్న బీరప్ప బక్తుడు గుగ్గిలం ఏసినట్ల బారెడెత్తున ఎగిరి ఎడ్మబాజున దోతిగట్టి నిలవడ్డ శంకరయ్యను ఎత్తుకోని రూబరూ సిందు దొక్కవట్టిండు. ఈ శిగాలు జూస్తున్నా ఎవ్వరికి యాదీ తోచలేదు. ఆ సందుట్లనే మల్లి కోడి పిల్లను దెచ్చి వీళ్ల మీదికి దిప్పి బైండ్లోనికిచ్చింది అసలు ఆలు మొగుండ్లను మర్సి వీండ్లిద్దరికి మిత్తిదీసి బొట్టువెట్టింది. ఉగ్రాలు శాంతిచ్చినవి. రొండెర్గని దోస్తులు సప్ప ట్లు గొట్టుకుంట పాటోలు దీసింద్రు.

నా కండ్లు బైర్లు గమ్మవట్టినవి. నేనేం జేతు ? నా మ్యానగోడలూ శంకరు, దేవుని సాక్షిగ ఆలుమొగుండ్లయిన్రు. ' ఇది దెలిస్తె మా తమ్ముడు గుండె వలిగి సస్తడు. పిలగాడు సదువు కున్నోడే, సక్కనోడే, బండాలం గిండాలం ఉన్నోడె. అయితె కులం ? వాళ్ళు బాపనోళ్ళు మేం కాపోండ్లం ! ఎవ్వరి కులానికి వాండ్లె ఎక్కువ. మాతమ్ముడు పేరున్న మనిషి. అగ్గి అసోంటి వంశం. నల్పుదాకి ఎర్గం ? ఇప్పుడు ? నల్గుట్ల నెత్తి రుమా లు కింధవడేటట్లాయె ! ఇంతకూ మా పిల్ల మనసెట్లుండదో అంట మెల్లగ దానికాడి కొచ్చి బిర బిర సాటుకు దోల్క వొయి దాన్ని గదిలిచ్చిన. అది బో అనుకుంట నా ఎదకు వాలి 'అత్తా ! మా ఇద్దరికి ఇదివరకే మనుసులు గల్సినవి, గని చెప్పలేకపోయిన ఏం జేస్తవో అంట కండ్లు మూసుకున్నది. టెలిపోనిచ్చినట్ల మా తమ్మునికి వర్తమానం అందనే అం దింది. ఎవ్వరి మొకాన కత్తేస్తే నెత్తురుసుక్కలేనట్ల పాలిపోయింద్రు. అతీ గతి అర్సుకొనే టోళ్లు లేక పట్న పోండ్లంత సావిట్లకు నడ్సింద్రు. మా మర్దలు దేవుణి అరలకు వోయి తలుపులు బిగిచ్చుకున్నది. మా తమ్మణి ముంగల నిలవడే దైర్నం ఎవరికి అబ్బ లేదు.

తెల్లారింది. శంకరయ్య వాళ్ల వూర్కిపోయి తండ్రి పరంధామయ్యకు జర్గిన సంగతి జెప్పి పార్వతే నా భార్య అన్నడంట. ఆ మాటిన్న పరంధామయ్య నిప్పు దొక్కిన కోతోలె, అగ్గిమీది గుగ్గిలం వోలె మండుకుంట , నాగోలె బుసలు గొట్టుకుంట, జంజెం ఎడ్మకేసుకోని 'పోరా కడుప్ప చెడబుట్టినోడ ? ఈనాటితోటి నీకు ఘటాశార్థం బెట్టిన. నీకూ నాకూ తెగదెంపులే ! నా కడ్ప ఇంగోసారి దొక్కి, నాయిల్లు మైలవడ జేయకు ' అన్నడంట.

సప్పుడెని తల్లి గుడ్ల నీళ్ల గుక్కకుంట 'కొడ్కా ' అంట వచ్చేట్యాళ్లకు కర్కోటకుడు తల్పులు బిగిచ్చు కున్నడంట. అదే ఊపుతోటి శంకరయ్యొచ్చి మా పెద్ద బంకులెదురుగ నిలవడి 'పార్వతీ ' అన్నడు. మా ఇంటి ఇల్లుపాది యావత్తు జనం బీరు

పోయి చిత్తారి బొమ్మలోలె నిల్వుగండ్లు వడ్డట్ల జూస్తుంటె ''నా మ్యానగోడలు కట్టు బట్టల్తోటి కడ్పదాటి శంకరయ్య ఎంట నడ్సింది.

అత్తయ్యా ! ఓ మై గాడ్ ! నీవు చెప్పేది నిజమేనా ? అయితె వాళ్ళిద్దరు ఇప్పుడెక్కడున్నరు ? ఏం జేస్తున్నరు? తొందరగా చెప్పత్తా ! అన్నది.

అయ్యో తిక్క తల్లీ ! మీ జానపద సంగానికి పెబ్బోలె వొచ్చి శివుని గుళ్ళ దిగిన శంకరే ఈ శంకరయ్య. ఆసంగతి జెప్పిన పాలేరు రాములను ' నీ శార్దం సెట్టు కింద వెట్ట ' పొద్దున్నె నా చెవులను పొడిస్తివి గదరా ! అంట తిట్టుకుంటవోయి గడెమంచె మీద నిల్వు నా గూాలవడ్డడంట పరంధామయ్య.

అత్తయ్యా ! ఇక మీ కథ తర్వాత వింటాను, అంటూ లేవబోతే? అమ్మా లక్ష్మి ! ఏగిరపడకు. నలదమయంతులోలె వాళ్ళు వొనవాసం జేస్తుండరు, పార్వతమ్మను ఇడ్సి శంకరయ్య వొంటిగరాడు. ఆపిలగాడు నా మ్యానగోడల్ని దోల్కొచ్చిండొచ్చు. అందుకే ఆ రావణాసురుని బయానికి పాపం కొడుక్క గుళ్ల ఇంతజాం జేస్కొని వుండొచ్చు. ఇదంత దల్సుకుంటే నాకు కంపురం బుట్టుకొస్తుండది బిడ్డా అన్నది.

అత్తయ్యా ! మీరేం భయపడవద్దు. అక్కయ్య ఆ బ్రహ్మరాక్షసి ఇంటికి పోకపోతె వనింటికి రావచ్చుగా ! మా ఫ్రెండ్స్‌తో ఈ విషయం చెప్పి విజ్ఞానవంతులూ 'మనఃప్రవృత్తి నెరిగిన సాంఘిక వేత్తలూ అయిన మా 'జానపద సరస్వతి '' సభ్యులనే ఈ విషయం తేల్చమంటాను అంట అన్నది.

లక్ష్మి ! ఆ దుడుకు మానే ! ఊపిరోలె పీల్సుకుంటున్న ఈ మర్యాదను మంట గల్పకే తల్లి ! మీ జానపద సంగం అంటె మా మాణిక్యాలను గొంచ వొయ్యెటోళ్ళని నాకు భయం.

అత్తా ! నీకా భయం వద్దు ! నిజంచెప్పాలంటే నీవే జానపద సరస్వతివి. అక్కా బావను నీ లాంచనాలతో ఎదుర్కో ! వస్తాను '' అంటూ వెళ్ళింది. మరి ఈ మెరుపు ఏ మేఘాన్ని కూడుతుందో ! అంటూ ఎచ్చమ్మ సన్నగా నవ్వింది.

ఇవీ మొన్న జర్గిన మా వూరి కతలు - అవే యీ ముచ్చట్లు.